క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

నాగోలు: ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్ పరిధిలోని భరత్‌నగర్‌కు చెందిన రమాకాంత్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ. 27 వేల చెక్కును సోమవారం తన నివాసంలో ఉప్పల శ్రీనివాస్ గుప్తా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి ద్వారా పేద కుటుంబాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు.

బధిరుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్‌గా నాగలక్ష్మి

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్‌గా నాగలక్ష్మి పదవీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన అరుణ వికలాంగుల సంక్షేమశాఖ పీడీ డైరెక్టర్‌గా ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ.. బధిరుల ఆశ్రమ పాఠశాలలో మెరుగైన సదుపాయాలతో పాటు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

వసతుల కల్పనకు కృషి

మలక్‌పేట: డివిజన్‌ను అభివృద్ధి చేయడంలో రాజీపడే ప్రసక్తి లేదని మూసారంబాగ్ కార్పొరేటర్ భొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. కృష్ణతులసినగర్‌లో రూ. 20 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడుతూ.. కమ్యూనిటీహాల్ ప్రహరీ, వాకింగ్ పాత్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. కాలనీలో ఉన్న ఖాళీ స్థలం వివాదానికి తెరదించి కమ్యూనిటీహాల్ నిర్మించామన్నారు. కాలనీవాసుల సౌకర్యార్థం మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి సురేందర్, కొంగర ప్రవీణ్, జయరాజ్, రఘు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

నాగోలు: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు. సోమవారం నాగోలు డివిజన్ పరిధిలోని జైపురికాలనీ బ్లైండ్స్ కాలనీలో నూతన కమ్యూనిటీ హాల్, స్లాబ్ పనులకు కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. కమ్యూనిటీ హాల్ స్లాబ్ నిర్మాణంలో నాణ్యత పాటించి కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలన్నారు.

ప్రమాద ఘంటికలు

శిథిలావస్థకు చేరిన అంబేడ్కర్ యూత్ భవనం

● యాభై ఏళ్ల క్రితం నిర్మాణం



కొత్తపేటలో శిథిలావస్థకు చేరుకున్న భవనం (ఇన్‌సెట్) పెచ్చులూడిన పైకప్పు

మహేశ్వరం: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధి కొత్తపేట గ్రామంలోని అంబేడ్కర్ యువజన సంఘం భవనం శిథిలావస్థకు చేరుకొని ప్రమాదపు ఘంటికలు మోగిస్తోంది. భవనం పైకప్పు పెచ్చులూడుతూ ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. శిథిలమైన కారణంగా భవనంలో వివిధ సమావేశాలు నిర్వహించుకోవడానికి గ్రామ యువకులు బిక్కుబిక్కుమంటున్నారు. గ్రామంలో ఉన్న రెండు కమ్యూనిటీ హాళ్లకు గాను రెండు కూడా ఇలా శిథిలావస్థకు చేరుకోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిలమైన భవనాల స్థానంలో మరింత విశాల భవనాలు నిర్మించినట్లయితే గ్రామ ప్రజలు చిన్న చిన్న శుభ కార్యాలు నిర్వహించుకునేందుకు కూడా సౌకర్యవంతంగా ఉంటుందంటున్నారు.

ఐదు దశాబ్దాలుగా..

కొత్తపేట గ్రామంలో ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనాన్ని అంబేడ్కర్ యువజన సంఘానికి కేటాయించారు. అప్పటి నుంచి ఈ భవనంలో సంఘం ఆధ్వర్యంలో డా.బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి, జయంతి కార్యక్రమాలను నిర్వహించేవారు. వీటితో పాటు వినాయక చవితి ఉత్సవాలు, స్వ యం సహాయక పొదుపు సంఘాల సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు. దాదాపు ఐదేళ్ల నుంచి ఈ భవనం పూర్తిగా శిథిలమై పెచ్చులూడుతూ కింద పడిపోతుంది. వర్షాకాలం వచ్చిందంటే పూర్తిగా కురుస్తుండడం పట్ల భవనం పొరుగు ఇళ్ల ప్రజలు కూడా భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

దినదిన గండం



నాకు పదేళ్ల వయసున్నప్పుడు ఈ భవనం నిర్మించారు. అప్పట్లో గ్రామానికి సంబంధించి సమావేశాలను ఇందులోనే నిర్వహించుకునేవాళ్లం. ప్రస్తుతం ఈ భవనం పూర్తిగా శిథిలం కావడంతో తాళం పెట్టేశారు. అయినప్పటికీ యు వత అందులోనే ఒక్కోసారి ప్రమాదపుటంచున సమావేశాలు నిర్వహిస్తున్నారు. భవనం పరిసరాల్లో చిన్నారులు ఆటలాడుతుంటారు. ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొని ప్రజా వసరాల నిమిత్తం విశాల భవనాన్ని నిర్మించాలి.

– కె.శంకర్, కొత్తపేట

నూతన భవనం నిర్మించాలి



పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న ఈ భవనం ప్రమాదకరంగా మారింది. ఇప్పటికే భవనం బయటి భాగంలోని రెయిలింగ్ కూలడంతో పాటు పైకప్పు పెచ్చులూడుతోంది. రెండేళ్లుగా వినాయక చవితి ఉత్సవాలను ఆరుబయటే నిర్వహించుకోవాల్సి వస్తుంది. రెండు భవనాలు శిథిలమైనందున నూతన భవనాన్ని నిర్మించాలని ఇప్పటికే మున్సిపాలిటీ అధికారులకు కూడా విన్నవించాం. ప్రమాద తీవ్రతను గుర్తించి ఇప్పటికైనా స్పందించాలి.

– జింకల శ్రవణ్‌కుమార్, కొత్తపేట

మాదిగల పోరాట ఫలితమే వర్గీకరణ



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: గత 30 ఏళ్లుగా ఎస్సీ మాదిగ ఉపకులాలు చేస్తున్న పోరాటం ఫలించిందని, సుప్రీంకోర్టు తీర్పు ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వటం హర్షణీయమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పచెబుతూ తీర్పు ఇవ్వడం సంతోషకరమన్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి, ఎమ్మెల్యే డప్పు వాయించి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి, చిరంజీవి, రమేష్, స్వామి, గాలయ్య పాల్గొన్నారు.

పట్టాలున్న వారికే 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న సొసైటీ సభ్యులు

చాదర్‌ఘాట్: పట్టాలు పొందిన లబ్ధిదారులకే డబుల్ ఇళ్లను అప్పగించాలని మంఖాల్–2 డబుల్ బెడ్రూమ్ లబ్ధిదారుల సంక్షేమ సంఘం అసోషియేషన్ ప్రధాన సలహాదారుడు ఖాజా అన్నారు. చాందిని ఫంక్షన్‌హాల్లో సోమవారం నిర్వహించిన మంఖాల్–2 లబ్ధిదారుల సమావేశంలో ఖాజా మాట్లాడారు. మలక్‌పేట, యాకత్‌పురా సమీప ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు లక్కీడ్రా ద్వారా ఇళ్లు కేటాయించారన్నారు. గత ప్రభుత్వం పట్టాలు కేటాయించినప్పటికీ ఇళ్లను మాత్రం అప్పగించలేదని ధ్వజమెత్తారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సయ్యద్ ఇబ్రహీం, ప్రధాన కార్యదర్శి సలహాదారుడిగా ఖాజా, సయ్యద అహ్మద అలీ, ఉపాధ్యక్షుడిగా మహ్మద్‌అలీ, కార్యదర్శులుగా జావేద్‌ఖాన్, సయ్యద్‌మోసీన్, కోశాధికారిగా సులేమాన్‌ను ఎన్నుకున్నారు.

వయనాడ్ బాధితులను ఆదుకోవాలి



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు



నగదును జంగయ్యకు అందజేస్తున్న నాయకులు

మన్సూరాబాద్: కేరళ వయనాడ్ బాధితులను ఆదుకోవడం అందరి బాధ్యత అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు సోమవారం హయత్‌నగర్ మండల కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా రవీంద్రచారి మాట్లాడుతూ.. హయత్‌నగర్ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న వాణిజ్య సముదాయాల నుంచి విరాళాలు సేకరించామన్నారు. కేరళలో జరిగిన ప్రకృతి విలయతాండవాన్ని కేంద్రప్రభుత్వం స్పందించి జాతీయ విపత్తుగా ప్రకటించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి రమావత్ సక్రు, శ్రీదేవి, సరిత, నాగరాజు, కృష్ణ పాల్గొన్నారు.

సరూర్‌నగర్‌లో..

నాగోలు: కేరళ వరద బాధితులను ఆదుకోవాలని పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు సరూర్‌నగర్ మండల పార్టీ ఆధ్వర్యంలో సోమవారం విరాళాలు సేకరించి సీపీఐ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యకు అందజేశారు. మండల కార్యదర్శి బతరాజు నరసింహా, సహాయ కార్యదర్శి కందుల సుధాకర్ ఇతర పార్టీ నాయకులు వివిధ వ్యాపారుల నుంచి రూ.5000 నగదును సేకరించామన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో (1994–95) లో పదో తరగతి పూర్తయిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని వీఎస్‌ఆర్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని సంతోషంగా గడిపారు. ఒకరినొకరూ పలకరించుకుని యోగ క్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో రామిడి బ్రహ్మానందరెడ్డి, కె.మహిపాల్‌రెడ్డి, డి.యాదయ్య, సీహెచ్.ప్రేమ్‌కుమార్, బీ.జగన్, వై.భిక్షపతి, సీహెచ్.మంజుల, కె.జ్యోతి, అమరావతి పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసులను చూసి పరుగులు

నాలుగో అంతస్తు పైనుంచి పడి యువకుడు మృతి

సైదాబాద్: ఎక్సైజ్ పోలీసులను చూసి భయపడి పరిగెత్తిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు పైనుంచి పడి మృతి చెందిన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతుని బంధువులు, సింగరేణి కాలనీ వాసుల వివరాల ప్రకారం.. సింగరేణి కాలనీలో నివసించే ఖలీం పాషా (28) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం కాలనీలోని ఓ దుకాణం ముందు కూర్చొని ఉండగా అప్పుడే అక్కడికి మలక్‌పేట ఎక్సైజ్ పోలీసులు వచ్చారు. వారిని చూసి భయపడిన ఖలీంపాషా అక్కడి నుంచి పరిగెడుతూ సమీపంలోని వాంబే గృహసముదాయాల నాలుగవ అంతస్తు పైకి చేరుకొని అక్కడి నుంచి పైపుల ద్వారా కిందకు దిగే ప్రయత్నం చేస్తుండగా ప్రమాదవశాత్తు పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఖలీంపాషాను ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఖలీం పాషా మృతికి మలక్‌పేట ఎక్సైజ్ పోలీసుల తీరు, కాలనీలో మత్తు పదార్థాల అమ్మకాలే కారణమంటూ మృతుని కుటుంబ సభ్యులు చంపాపేట రహదారిపై నిరసనకు దిగడంతో వాహనాలు ఎక్కడికక్కడ స్తంభించి పోయాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తామని చెప్పడంతో నిరసన విరమించారు. సింగరేణి కాలనీలో విచ్చలవిడిగా గంజాయి, మత్తు పదార్థాలు అమ్ముతున్నా మలక్‌పేట ఎక్సైజ్ పోలీసులు పట్టించుకోవడం లేదని సింగరేణి కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. అప్పుడప్పుడూ తనిఖీల పేరుతో హడావుడి చేయడం తప్ప, ఇక్కడి యువకులు మత్తుకు బానిసవుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు టమాట రూ. 27, వంకాయ రూ. 40, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ. 55, కాకర రూ. 45, బీర రూ. 35, క్యాబేజి రూ. 23, ఫ్రెంచి బీన్స్ రూ. 60, క్యారెట్ రూ. 35, దొండ రూ. 38–40, చిక్కుడు రూ. 75, గోకర రూ. 35, బీట్‌రూట్ రూ. 25, క్యాప్సికం రూ. 50, ఆలు రూ. 38, దోస రూ. 17, సొర రూ. 13, పొట్ల రూ. 15, ఉల్లిగడ్డ రూ. 37, చామగడ్డ రూ. 40. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్: అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని చిత్రసీమకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జిన్న ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాలనీ కమ్యూనిటీహాల్ వద్ద సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. కాలనీలోని ఖాళీగా ఉన్న ప్లాట్లలో కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండా షెడ్లువేసి వాషింగ్ సెంటర్, టీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. వాణిజ్య సముదాయాలకు ఎదురుగా వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి దోనూరి మధుసూదన్‌రెడ్డి, సభ్యులు మాధవరెడ్డి, జీజే రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాఘవరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఐ సుధాకర్‌కు సీపీ అభినందనలు



డీఐ సుధాకర్‌ను అభినందిస్తున్న సీపీ

నాగోలు: ఏప్రిల్ 29 నుంచి మే 17వ వరకు అమెరికాలోని యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ బ్యూరో ఆఫ్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అఫైర్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ విజిటర్ లీడర్‌షిప్ ప్రోగ్రాంలో పాల్గొన్న ఎల్‌బీనగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎర్రోజు సుధాకర్‌ను సోమవారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు అభినందించారు. ప్రపంచాన్ని మరింత సురక్షితమైన ప్రదేశంగా మార్చడంతో పాటు ఇండో పసిఫిక్, దక్షిణ మధ్య ఆసియా ప్రాంతాల్లో దేశాంతర నేరాల నియంత్రణ కోసం చేపట్టాల్సిన చర్యల గురించి ఈ కార్యక్రమంలో శిక్షణ ఇవ్వడం జరిగిందని ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న నూతన అంశాలను రాచకొండ పరిధిలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం కూడా ఉపయోగించాలని కమిషనర్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 46 దేశాలకు చెందిన పోలీసుల అధికారులతో అమెరికా (ఐవీయల్‌బీ) అంతర్జాతీయ సందర్శకుల నాయకత్వ కార్యక్రమం 2024 నిర్వహించిన భారతదేశం నుంచి ఎల్‌బీనగర్ డీఐ సుధాకర్ ఒక్కడే ఈ కార్యక్రమానికి వెళ్లాడు. 46 దేశాలకు చెందిన పోలీస్ అధికారులను ఆహ్వానించి సుమారు నెల రోజుల పాటు 4 రాష్ట్రాలను చుట్టి ముఖ్యంగా మానవ అక్రమ రవాణాపై నివారణ, గంజాయి, డ్రగ్స్, నకిలీ పాస్‌పోర్ట్స్, అనుమతి లేకుండా దేశంలోకి చొరబాటుదారుల కట్టడి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



కందుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



మహేశ్వరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి, అధికారులు

కందుకూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని సీజనల్ వ్యాధులు సోకకుండా తమను తాము కాపాడుకోవాలని మండల ప్రత్యేకాధికారి, రాష్ట్ర ఆడిట్ శాఖ డీడీ వెంకట్ సూచించారు. సోమవారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకు గ్రామాల్లో చేపట్టిన స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులను ఆయన పర్యవేక్షించారు. కందుకూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాలన్నీ స్వచ్ఛతకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందుకు ప్రతి పౌరుడు తన బాధ్యతగా ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరిత, డీఎల్‌పీఓ లక్ష్మినారాయణ, ఏపీఎం కవిత, పంచాయతీ కార్యదర్శి సురేందర్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, వీఓలు పాల్గొన్నారు.

స్వచ్ఛదనంతో జీవన ప్రమాణాలు మెరుగు

మహేశ్వరం: గ్రామీణా ప్రాంతాల్లో స్వచ్ఛదనాన్ని పెంచి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిందని మండల ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఈ కార్యక్రమాన్ని ఆమె అధికారులతో ప్రారంభించి విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన చుట్టూ ఉన్న పరిసరాలను ఎప్పటికప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె కోరారు. ఇంటిస్థాయిలో చెత్తను వేరు చేయడంపై గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించాలన్నారు. తడి, పొడి చెత్తను వేసి చేసి వర్మీకంపోస్టు తయారు చేయించాలన్నారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు మహేశ్వరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించి, విద్యార్థులు, అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజ, ఎంపీడీఓ రవీందర్‌రెడ్డి, మండల విద్యాధికారి కృష్ణ, ఏపీఎం సత్యనారాయణ, ఏపీడీ పరిమళ, పంచాయతీ కార్యదర్శి సుజాత పలువురు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన

బడంగ్‌పేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని బడంగ్‌పేట కార్పొరేషన్‌లో మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి సోమవారం ప్రారంభించారు. నూతన బడంగ్‌పేట కార్పొరేషన్ నుంచి పాత గ్రామ పంచాయతీ చౌరస్తా వరకు ప్లకార్డులు పట్టుకుని అధికారులు, పాలకులు కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని గుర్తు చేశారు. కార్యక్రమంలో కమిషనర్ రఘుకుమార్, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడ: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మొదటిరోజు అధికారులు, కౌన్సిలర్లు, విద్యార్థులతో కలిసి శ్రీశైలం జాతీయ రహదారిపై స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛ మున్సిపాలిటీ కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ భవాని వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు సుమన్, ఆర్.రాజు, మేనేజర్ పర్వతాలు, ఏఈ కె.భార్గవ్‌రెడ్డి, సిబ్బంది వెంకటేశ్, జంగయ్య, మల్లేశ్, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్: స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మేయర్, అధికారులు



తుక్కుగూడలో..

రోడ్లపై మురుగు.. శుభ్రత కనుమరుగు

● హస్తినాపురం డివిజన్‌లో దుర్గంధంగా పరిసరాలు
● రోగాలబారిన ప్రజలు
● పట్టించుకోని అధికారులు



మురుగు పారడంతో గుంతలమయంగా మారిన రోడ్డు



రోడుపై పారుతున్న మురుగు

హస్తినాపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ హస్తినాపురం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ లీకేజీల కారణంగా మురుగు ఏరులై పారుతోంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఏ రోడ్డుపై చూసినా మురుగు నీరే పారుతోంది. దీని కారణంగా దోమలు విజృంభించి రోగాలబారిన పడేస్తున్నాయని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. హస్తినాపురం, చంపాపేట, వనస్థలిపురం డివిజన్లలో దాదాపు 170కి పైగా కాలనీలు ఉండగా ఆయా డివిజన్ల పరిధిలోని పలు కాలనీలు ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్నాయి. ఈ ప్రాంతాలలో పూర్తిస్థాయి డ్రైనేజీ లేకపోవడంతో నిత్యం మురుగు రోడ్లపైనే పారుతూ ఉంటుంది. పారిశుద్ధ్య పనులు సైతం సక్రమంగా జరగకపోవడంతో కాలనీలలో చెత్తా చెదారం పేరుకుపోతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాలలో రోడ్ల పక్కన బహిరంగ ప్రదేశాలలో చెత్తా చెదారం పేరుకుపోయి పిచ్చి మొక్కలు పెరిగినా వాటిని తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సమస్యలపై ఉన్నతాధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.